క్లుప్తంగా

విద్యార్థులకు ప్రతిభా పురస్కారాలు



విద్యార్థులకు పురస్కారాలు అందిస్తున్న నాయకులు

జగిత్యాల: మున్నూరుకాపు ఉద్యోగ విశ్రాంతి ఉద్యోగుల సంఘం జగిత్యాల శాఖ ఆధ్వర్యంలో జిల్లా మున్నూరుకాపు సంఘం నాయకులు విద్యార్థులకు పదో తరగతి ఇంటర్‌లో అత్యంత ప్రతిభ కనబర్చిన వారికి స్థానిక ఎస్వీఎల్ఆర్ గార్డెన్స్‌లో సోమవారం ప్రతిభ పురస్కారాలు అందజేశారు.విద్యార్థులు ఉన్నతస్థాయికి వెళ్లాలని ఆకాంక్షించారు. కార్యక్రమంలో సంఘం అధ్యక్షుడు రవిబాబు, ప్రొఫెసర్ బాలె శ్రీనివాస్, ఆకుల వెంకట్‌రావు, అరుణ్‌కుమార్, శంకరయ్య, కందుకూరి కృష్ణారెడ్డి, ఒడ్నాల రాజశేఖర్, అరిగెల అశోక్, రమణరెడ్డి పాల్గొన్నారు.

ఇసుక అక్రమంగాతరలిస్తే కఠిన చర్యలు



సమావేశంలో పాల్గొన్న అధికారులు

కథలాపూర్: అక్రమంగా ఇసుక తరలిస్తే కఠిన చర్యలు తీసుకుంటామని తహసీల్దార్ ముంతాజిబొద్దీన్, ఎంపీడీవో శంకర్, ఎస్సై నవీన్‌కుమార్ అన్నారు. సోమవారం కథలాపూర్ మండల పరిషత్ కార్యాలయంలో రెవెన్యూ, పంచాయతీరాజ్‌శాఖ అధికారుల సమన్వయ సమావేశం నిర్వహించారు. వాగుల్లో నుంచి ఇసుకను తీసుకువచ్చి గ్రామాల్లో అక్రమంగా నిల్వ ఉంచితే తమకు సమాచారం ఇవ్వాలని కార్యదర్శులకు సూచించారు. చెరువుల్లో నుంచి అక్రమంగా మట్టిని తీసి వ్యాపారం చేసేవారిపై చర్యలు తీసుకోవాలన్నారు. గ్రామాలవారీగా అక్రమంగా ఇసుక, మట్టి వ్యాపారాలు చేసేవారి వివరాలను అధికారులు చర్చించారు. సమావేశంలో ఎంపీవో ప్రవీణ్, ఆర్ఐ నాగేశ్, పంచాయతీ కార్యదర్శులు పాల్గొన్నారు.

వర్షాలు కురవాలని దేవుళ్లకు జలాభిషేకం



వేంకటేశ్వర ఆలయంలో భక్తుల పూజలు

కొండగట్టు: వర్షాలు కురవాలని కొడిమ్యాల మండల కేంద్రంలోని తూర్పు వాడ, పడమటి వాడ రెడ్డి సంఘం సభ్యుల ఆధ్వర్యంలో సోమవారం ఆలయాల్లో ప్రత్యేక పూజలు నిర్వహించారు. మండల కేంద్రంలోని అన్ని ఆలయాలను శుభ్రం చేసి, దేవుళ్లకు జలాభిషేకం, పూజలు చేశారు. కార్యక్రమంలో ఆలయ పూజారులు భాస్కర్ ,రమేశ్, తూర్పువాడ, పడమటి వాడ రెడ్డి, సంఘం కార్యవర్గ సభ్యులు గ్రామస్తులు పాల్గొన్నారు.

బాధ్యతలు స్వీకరించిన రూరల్ సీఐ



ఎస్పీకి పుష్పగుచ్ఛం అందిస్తున్న రూరల్ సీఐ

జగిత్యాలక్రైం: జగిత్యాల రూరల్ సీఐగా కృష్ణారెడ్డి సోమవారం బాధ్యతలు స్వీకరించారు. అనంతరం జిల్లా ఎస్పీ అశోక్‌కుమార్‌ను కలిసి పుష్పగుచ్ఛం అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, శాంతిభద్రతల పరిరక్షణకు కృషి చేస్తానని, ఫిర్యాదుదారులకు సత్వర సేవలందేలా కృషి చేస్తానని తెలిపారు.

మత్తు పదార్థాల అనర్థాలపై నేడు అవగాహన సదస్సు

జగిత్యాల: దివ్యాంగులు, వయోవృద్ధులు, ట్రాన్స్‌జెండర్ల వ్యక్తుల సాధికారత సంస్థ జగిత్యాల ఆధ్వర్యంలో మిషన్ పరివర్తనలో భాగంగా ఈనెల 26న అంతర్జాతీయ డ్రగ్స్ వినియోగ నిరోధ దినోత్సవాన్ని పురస్కరించుకుని అవగాహన సదస్సు, ర్యాలీ నిర్వహిస్తున్నట్లు జిల్లా సంక్షేమాధికారి వాణిశ్రీ తెలిపారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ ర్యాలీ కొత్త బస్టాండ్ నుంచి కలెక్టరేట్ వరకు ఉంటుందని, అనంతరం జిల్లా కలెక్టరేట్‌లో సమావేశం నిర్వహించనున్నట్లు తెలిపారు. ప్రజలు భారీగా తరలివచ్చి కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని కోరారు.

అభివృద్ధి పనుల జాప్యంపై ఎమ్మెల్యే ఆగ్రహం

- ఏడీఈ కార్యాలయం ఇబ్రహీంపట్నం లోనే ఏర్పాటు చేయాలి
- మండల సర్వసభ్యసమావేశంలో సభ్యుల తీర్మానం



మాట్లాడుతున్న ఎమ్మెల్యే కల్వకుంట్ల సంజయ్

ఇబ్రహీంపట్నం: పంచాయతీ రాజ్ ఆధ్వర్యంలో చేపట్టిన అభివృద్ధి పనుల జాప్యంపై కోరుట్ల ఎమ్మెల్యే కల్వకుంట్ల సంజయ్ ఆగ్రహం వ్యక్తం చేశారు. సోమవారం ఎంపీపీ జాజాల భీమేశ్వరి అధ్యక్షతన నిర్వహించిన మండల సర్వసభ్య సమావేశానికి హాజరై మాట్లాడారు. అభివృద్ధి పనులు నత్తనడకన ఎందుకు కొనసాగుతున్నాయో అధికారులు జవాబివ్వాలన్నారు. ట్రాన్స్‌కో ఏడీఈ కార్యాలయాన్ని ఇబ్రహీంపట్నంలోనే ఏర్పాటు చేయాలని సభ్యులు తీర్మానించారు. ఇరిగేషన్ సబ్‌డివిజన్ కార్యాలయం ఇబ్రహీంపట్నంకు మంజూరైందని, త్వరలోనే కార్యాలయాన్ని ప్రారంభిస్తామని తెలిపారు. విద్యుత్ అధికారులు విద్యుత్ తీగల కింద చెట్ల కొమ్మలు కొట్టాల్సింది పోయి, పూర్తిగా చెట్లనే కొట్టివేశారని, అలా చేయడం తప్పు అని , వెంటనే వాటి స్థానంలో విద్యుత్ అధికారులు మొక్కలు నాటాలని ఆదేశించారు. ముందుగా ఆయాశాఖల అధికారులు సమీక్షలు చదివి వినిపించారు. అంగన్‌వాడీ కేంద్రాలలో ఆయాపోస్టులను భర్తీ చేయాలని ఇబ్రహీంపట్నం ఎంపీటీసీ రాములు, యామాపూర్ ఎంపీటీసీ బోరిగం వివేకవర్ధిని కోరారు. డబ్బా నుంచి వర్షకొండ రోడ్డు అధ్వాన్నంగా ఉందని, బీటీ రోడ్డుకు నిధులు మంజూరైనా పనులు ప్రారంభం కాలేదని డబ్బా ఎంపీటీసీ దెొట్టి శాంత అడుగగా, వెంటనే పనులు ప్రారంభించేలా చర్యలు తీసుకోవాలని అధికారులను కోరారు. అనంతరం ఎంపీపీ, జెడ్పీటీసీ, వైస్‌ఎంపీపీ, సభ్యులను ఎమ్మెల్యే, అధికారులు ఘనంగా సన్మానించారు. సమావేశంలో జెడ్పీటీసీ భారతి, ఇన్‌చార్జి ఎంపీడీవో రాజేందర్‌రెడ్డి, తహసీల్దార్ ప్రసాద్, ఏడీఈ మనోహర్, వైస్ ఎంపీపీ నోముల లక్ష్మారెడ్డి, ఆయా శాఖల అధికారులు, ఎంపీటీసీలు పాల్గొన్నారు.

అభివృద్ధి పనులు ప్రారంభం

మండలంలోని గోధూర్‌లో రూ. 4 లక్షలతో నిర్మించిన గంగపుత్ర భవనాన్ని , రూ. 8 లక్షలతో నిర్మించిన ముస్లిం కమ్యూనిటీ హాల్‌ను ఎమ్మెల్యే సంజయ్ ప్రారంభించారు. కార్యక్రమంలో ఎంపీపీ జాజాల భీమేశ్వరి, జెడ్పీటీసీ బారతి, గ్రామప్రత్యేకాధికారి మల్లేష్,వైస్ ఎంపీపీ నోముల లక్ష్మారెడ్డి, నాయకులు, గ్రామస్తులు పాల్గొన్నారు.

రుణమాఫీపై కాంగ్రెస్ సంబరాలు





రాయికల్, ధర్మపురిలో సీఎం, ఎమ్మెల్సీ, విప్ చిత్రపటాలకు క్షీరాభిషేకం చేస్తున్న కాంగ్రెస్ నాయకులు

రాయికల్: సీఎం రేవంత్‌రెడ్డి రైతులకు ఏకకాలంలో రూ.2 లక్షలు రుణమాఫీ చేస్తామని ప్రకటించడంతో సోమవారం కాంగ్రెస్ పార్టీ ఆధ్వర్యంలో గాంధీచౌక్ వద్ద సీఎం రేవంత్‌రెడ్డి, ఎమ్మెల్సీ జీవన్‌రెడ్డిల చిత్రపటాలకు క్షీరాభిషేకం చేశారు. ఈ కార్యక్రమంలో బ్లాక్ కాంగ్రెస్ అధ్యక్షుడు గోపి రాజిరెడ్డి, మండల అధ్యక్షుడు రవీందర్‌రావు, యూత్ జిల్లా ప్రధాన కార్యదర్శి కొయ్యడి మహిపాల్‌రెడ్డి, నాయకులు పాల్గొన్నారు.

పెగడపల్లిలో రైతుల సంబరాలు

పెగడపల్లి: మండల కేంద్రంలో కాంగ్రెస్ శ్రేణులు రైతు సంబరాలు జరిపారు. అంబేడ్కర్ చౌరస్తా వద్ద సీఎం రేవంత్‌రెడ్డి, ప్రభుత్వ విప్ ధర్మపురి ఎమ్మెల్యే అడ్లూరి లక్ష్మణ్‌కుమార్‌ల చిత్ర పటానికి క్షీరాభిషేకం చేసి స్వీట్లు పంపిణీ చేశారు. కార్యక్రమంలో మండల కాంగ్రెస్ అధ్యక్షుడు రాములుగౌడ్, జిల్లా ఉపాధ్యక్షుడు శ్రీనివాస్, వింటో మాజీ చైర్మన్ లక్ష్మీనారాయణ, నాయకులు పాల్గొన్నారు.

ధర్మపురి : రైతుల సంక్షేమం కోసం కృషి చేస్తున్న కాంగ్రెస్ ప్రభుత్వం రైతు ప్రభుత్వమని కాంగ్రెస్ మండలశాఖ అధ్యక్షుడు ఎస్ దినేశ్ అన్నారు. సోమవారం నంది కూడలి వద్ద కాంగ్రెస్ నాయకులు సీఎం రేవంత్‌రెడ్డి చిత్ర పటానికి క్షీరాభిషేకం చేశారు. కార్యక్రమంలో మండల నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

ఆస్పత్రి సమస్యలు సీఎం దృష్టికి తీసుకెళ్తా



ప్రభుత్వ ఆస్పత్రిని పరిశీలిస్తున్న నర్సింగరావు

కోరుట్ల: కోరుట్ల ప్రభుత్వ ఆస్పత్రిలో ఏమైనా సమస్యలు ఉంటే తన దృష్టికి తీసురావాలని, సీఎం రేవంత్ రెడ్డి దృష్టికి తీసుకవెళ్లి త్వరగా పరిష్కరిస్తానని కాంగ్రెస్ కోరుట్ల ఇన్‌చార్జి జువ్వాడి నర్సింగరావు అన్నారు. పట్టణంలోని ప్రభుత్వ ఆస్పత్రిని సోమవారం సందర్శించి మాట్లాడారు. నూతనంగా నిర్మించిన వంద పడకల ఆస్పత్రిలో మిగిలిన పనులను త్వరగా పూర్తి చేయాలని కాంట్రాక్టర్‌కు సూచించారు.ఆస్పత్రిలో వైద్యుల కొరత, ఇతర సమస్యలను తనకు వివరిస్తే సీఎం వద్దకు వెళ్లి పరిష్కరించేందుకు కృషి చేస్తానని పేర్కొన్నారు. అనంతరం వెటర్నరీ కళాశాలను పరిశీలించి మౌలిక వసతులు, సిబ్బంది వివరాలు కళాశాల డీన్‌ను అడిగి తెలుసుకున్నారు. కార్యక్రమంలో ప్రభుత్వ ఆస్పత్రి సూపరింటెండెంట్ సునీత, పశువైద్య కళాశాల డీన్ డాక్టర్ శ్రీనివాసులు, కౌన్సిలర్లు మోర్తాడ్ లక్ష్మీనారాయణ, ఎంబేరి నాగభూషణం,గుండోజి శ్రీనివాస్,పట్టణ, మండల కాంగ్రెస్ అధ్యక్షులు గంగాధర్ గౌడ్, రాజం , మహిళా కాంగ్రెస్ పట్టణ అధ్యక్షురాలు మచ్చ కవిత, నాయకులు పాల్గొన్నారు.

ఎమ్మెల్యే సంజయ్‌కుమార్ దిష్టిబొమ్మ దహనం



ఎమ్మెల్యే దిష్టిబొమ్మ దహనం చేస్తున్న నాయకులు

మల్యాల: జగిత్యాల ఎమ్మెల్యే సంజయ్‌కుమార్ కాంగ్రెస్ పార్టీలో చేరడంతో మండల కేంద్రంలో సోమవారం బీఆర్ఎస్ నాయకులు ఆయన దిష్టిబొమ్మ దహనం చేశారు. ఈ సందర్భంగా నూకపల్లి పాక్స్ చైర్మన్ బోయినపల్లి మధుసూదన్‌రావు మాట్లాడుతూ సీఎం రేవంత్ రెడ్డి ప్రజా సంక్షేమ పథకాల అమలు మరిచి, ప్రతిపక్ష పార్టీల ఎమ్మెల్యేలను కాంగ్రెస్ చేర్చుకోవడంపై దృష్టిసారించి, ఫిరాయింపులను ప్రోత్సహిస్తున్నారని విమర్శించారు. ప్రజలు అంతా గమనిస్తున్నారని, రాబోయే రోజుల్లో కాంగ్రెస్‌కు తగిన గుణపాఠం చెబుతారని అన్నారు. కార్యక్రమంలో మాజీ సర్పంచులు బద్దం తిరుపతిరెడ్డి, గడ్డం రాజేశ్, సంగ సత్యనారాయణ, పోచమ్మల ప్రవీణ్, కొంక నర్సయ్య, అనిల్ రెడ్డి, అజారొద్దీన్, చిన్న దుర్గయ్య, రంజిత్, రవి పాల్గొన్నారు.

ఘనంగా పెద్దమ్మ తల్లి ఆలయ వార్షికోత్సవం



ఆలయంలో పూజలు చేస్తున్న భక్తులు

కోరుట్ల రూరల్ : పట్టణంలోని పెద్దమ్మ తల్లి ఆలయ వార్షికోత్సవం సోమవారం ఘనంగా జరిగింది. ఈ సందర్భంగా అమ్మవారికి ప్రత్యేక పూజలు, అర్చనలు, అభిషేకాలు నిర్వహించారు. అమ్మవారిని ఎమ్మెల్యే కల్వకుంట్ల సంజయ్, బీఆర్ఎస్ జగిత్యాల జిల్లా అధ్యక్షుడు కల్వకుంట్ల విద్యాసాగర్ రావు–సరోజన దంపతులు దర్శించుకుని పూజలు నిర్వహించారు. కాంగ్రెస్ కోరుట్ల ఇన్‌చార్జి జువ్వాడి నర్సింగరావు అమ్మవారికి ప్రత్యేక పూజలు చేసి అన్నదానం కార్యక్రమంలో ప్రారంభించారు. కార్యక్రమంలో ముదిరాజ్ సంఘ నాయకులు, ఆలయ కమిటీ సభ్యులు, భక్తులు పాల్గొన్నారు.

కుమ్మరిపల్లిలో సామూహిక హారతి

రాయికల్: మండలంలోని కుమ్మరిపల్లి లో హనుమాన్ ఆలయంలో సోమవారం ధర్మజాగరణ సమితి ఆధ్వర్యంలో సామూహిక హారతి నిర్వహించారు. ఈ సందర్భంగా ధర్మజాగరణ సమితి కార్యకర్త తిరుకోవెల సురేందర్ మాట్లాడుతూ హిందూ ధర్మ సంస్కృతిని కాపాడాల్సిన బాధ్యత ప్రతీ ఒక్కరిపై ఉందన్నారు.మహిళలు హనుమాన్ చాలీసా పారాయణం చేపట్టారు. కార్యక్రమంలో మాజీ సర్పంచ్ చింతలపల్లి స్వప్న, నాయకులు లక్ష్మీనర్సయ్య, రవీందర్‌రెడ్డి, జ్యోత్స్న, కవిత పాల్గొన్నారు.

విద్యార్థులకు బ్యాగులు, దివ్యాంగుడికి వీల్ చైర్ అందజేత

కథలాపూర్: మండలంలోని రాజారాం తండా గ్రామంలో ప్రభుత్వ పాఠశాల విద్యార్థులకు బీజేపీ ఆధ్వర్యంలో బ్యాగులు సోమవారం పంపిణీ చేశారు. విద్యార్థులు పుస్తకాలు, నోట్‌బుక్కులు ఒకేసారి పాఠశాలకు తీసుకెళ్లడానికి అనువుగా ఉంటుందని బ్యాగులను అందించినట్లు స్థానిక నాయకులు పేర్కొన్నారు. అనంతరం చింతకుంటలో మంతెన స్వామి అనే దివ్యాంగుడికి వీల్ చైర్ అందించారు. కార్యక్రమంలో బీజేపీ నాయకులు సురిగి వెంకటేశ్, లకావత్ తిరుపతి, కోరుట్ల రాజేశ్, తదితరులు పాల్గొన్నారు.

లింగనిర్ధారణ నేరం

జగిత్యాల: లింగనిర్ధారణ నేరమని, ప్రతి ఒక్క గర్భిణి పీసీపీఎన్డీ యాక్ట్‌పై తెలుసుకోవాలని సాధికారత కో–ఆర్డినేటర్ అశ్విని అన్నారు. సోమవారం మాతా శిశు కేంద్రంలో గర్భిణులకు అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ ప్రతి ఒక్కరు లింగ నిర్ధారణ చట్టం గురించి తెలుసుకోవాలని, ఆడపిల్లల ప్రాముఖ్యత ఎంతో ముఖ్యమన్నారు. కార్యక్రమంలో మహిళ సాధికారత బృందం గౌతమి, హేమశ్రీ, స్వప్న తదితరులు పాల్గొన్నారు.

బాధిత కుటుంబానికి ఆర్థిక సాయం

పెగడపల్లి: మండలంలోని లింగాపూర్ గ్రామానికి చెందిన కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకుడు, మాజీ సర్పంచి ఈరెల్లి శంకర్ ఇటీవల గుండె పోటుతో మృతి చెందాడు. బాధిత కుటుంబానికి కాంగ్రెస్ నాయకులు రూ.27 ఆర్థికసాయం అందజేశారు. కార్యక్రమంలో మండల కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు రాములుగౌడ్, జిల్లా ఉపాధ్యక్షుడు శ్రీనివాస్, సింగిల్ విండో మాజీ చైర్మన్ లక్ష్మీనారాయణ తదితరులు పాల్గొన్నారు.

పాత కక్షలతో ఒకరిపై కత్తితో దాడి

కొండగట్టు: పాత కక్షలతో ఓ వ్యక్తిపై దాడి చేసిన సంఘటన కొడిమ్యాల మండలం తిరుమలాపూర్‌లో చోటుచేసుకుంది. ఎస్సై సందీప్ కథనం ప్రకారం.. గ్రామానికి చెందిన ఆవునూరు విష్ణువర్ధన్‌కు అదే గ్రామానికి చెందిన ఉల్లెందుల అంజయ్యకు పాత కక్షలు ఉన్నాయి. వాటిని దృష్టిలో పెట్టుకున్న అంజయ్య విష్ణువర్ధన్‌ను వెనుక నుంచి వచ్చి కత్తితో పొడిచాడు. వెంటనే క్షతగాత్రుడిని చికిత్స నిమిత్తం ఆస్పత్రికి తరలించారు. బాధితుడి తండ్రి వెంకటేశం ఫిర్యాదు మేరకు కేసు దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై తెలిపారు.

యువకుడిపై దాడి యత్నం

కోరుట్ల: పట్టణంలోని గాంధీ రోడ్‌లో నివాసముండే పోగుల రాజేశ్(28) అనే యువకుడిపై సోమవారం రాత్రి కాల్వగడ్డ ఏరియాకు చెందిన ఓ యువకుడు కత్తితో దాడికి యత్నించాడు. ఈ లోగా రాజేశ్ గొడ్డలితో తిరగబడటంతో దాడికి వచ్చిన యువకుడు పరారైనట్లు తెలిసింది. సంఘటన స్థలానికి కోరుట్ల సీఐ సురేశ్‌బాబు చేరుకుని వివరాలు సేకరించారు. విచారణ చేసి కేసు నమోదు చేస్తామని సీఐ తెలిపారు. ఈ యువకుడు, పది మంది కలిసి మరో ఇద్దరిపై దాడి చేసినట్లు సమాచారం.

పనికని వచ్చి పైసలతో ఉడాయింపు

మల్యాల: గొర్రెల షెడ్‌లో పనిచేసేందుకు వచ్చిన దంపతులు కొద్దిరోజులు పనిచేసి డబ్బులతో ఉడాయించిన ఘటన మండలంలోని మానాలలో చోటుచేసుకుంది. గ్రామానికి చెందిన ఎడిపెల్లి మల్లయ్యకు చెందిన గొర్రెల షెడ్‌లో పనిచేసేందుకు ఆదిలాబాద్ జిల్లా ఇంద్రవెల్లికి చెందిన అజయ్, శారద వచ్చారు. ఏడాదికి రూ.1.30లక్షల వేతనంతో పనికి కుదిరారు. మల్లయ్య నుంచి రూ.1.30లక్షలు తీసుకున్నారు. సోమవారం షెడ్‌లోని సీసీ కెమెరాలు, తీగలు తొలగించి ఉడాయించారు. దీంతో బాధితుడు పోలీసులను ఆశ్రయించాడు.

ఫ్రెషర్ డే వేడుకలు

జగిత్యాలరూరల్: జగిత్యాల అర్బన్ మండలం తిప్పన్నపేటలోని సూర్యగ్లోబల్ స్కూల్‌లో ఫ్రెషర్స్‌డే వేడుకలు సోమవారం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా కొత్త విద్యార్థులను, పాత విద్యార్థులకు పరిచయం చేశారు. అనంతరం విద్యార్థుల సాంస్కృతిక కార్యక్రమాలు పలువురిని ఆకట్టుకున్నాయి. కార్యక్రమంలో పాఠశాల డైరెక్టర్లు శ్రీధర్‌రావు, హరిచరణ్‌రావు, మానికరావు, రజితరావు, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

విద్యార్థులకు అభినందన

జగిత్యాల: ఇంటర్ సప్లమెంటరీ, ఇంప్రూవ్‌మెంట్ ఫలితాల్లో జగిత్యాల నవ్య కళాశాల విద్యార్థులు అత్యంత ప్రతిభ కనబర్చి స్టేట్ ర్యాంకులు కనబర్చారు. ఎంపీసీ విభాగంలో మామిడిపల్లి హేమశ్రీ 426, బైపీసీలో గడపల్లి హాసిని 436, సీఈసీలో ఆకుల సాత్విక 483, ఎంపీసీలో సోనియా 465, బైపీసీలో భానవ 434 మార్కులు సాధించారు. ఈ సందర్భంగా విద్యార్థులను కరస్పాండెంట్ శ్రీపాద నరేశ్, ఈశ్వర్ అభినందించారు.

విధులకు డుమ్మా కొట్టిన కార్యదర్శులు



జగ్గాసాగర్‌లో తాళం వేసి ఉన్న కార్యదర్శి గది

మెట్‌పల్లిరూరల్: మెట్‌పల్లి మండలంలోని పలువురు గ్రామ పంచాయతీ కార్యదర్శులు అధికారుల అనుమతి లేకుండా విధులకు డుమ్మా కొడుతున్నారనే ఆరోపణలు వినిపిస్తున్నాయి. సక్రమంగా విధులు నిర్వర్తించాల్సిన కార్యదర్శులు కార్యాలయాల్లో అందుబాటులో ఉండడంలేదు. సోమవారం'సాక్షి' । పలు గ్రామపంచాయతీ కార్యాలయాలను సందర్శించగా.. కార్యదర్శుల గదులకు తాళం వేసి ఉన్నాయి. ఇందులో జగ్గాసాగర్, ఆత్మనగర్, బండలింగాపూర్ కార్యదర్శులతో పాటు మిగతా కొందరు అందుబాటులో లేరు.ఆయా చోట్ల ఉన్న పలువురిని కార్యదర్శి రాలేదా అని ఆరా తీయగా రెండు లేదా మూడు రోజులకు ఒకసారి కార్యాలయానికి వచ్చి.. వెళ్తారని చెప్పడం గమనార్హం. కాగా ఇందులో ఒక్కరు మాత్రమే సెలవులో ఉన్నట్లు తెలిసింది.

గౌరవ వేతనం అమలు చేయాలి



నిరసన వ్యక్తం చేస్తున్న మధ్యాహ్న భోజన కార్మికులు

జగిత్యాలటౌన్: మధ్యాహ్న భోజన కార్మికులకు రూ. 10 వేల గౌరవ వేతనంతో పాటు పెండింగ్ మెస్ బిల్లులు వెంటనే మంజూరు చేయాలని సీఐటీయూ జిల్లా కార్యదర్శి ఇందూరి సులోచన కోరారు. పెండింగ్ బిల్లులు, పెంచిన వేతనాలు విడుదల చేయాలని కోరుతూ సోమవారం కలెక్టరేట్ వద్ద మధ్యాహ్న భోజన కార్మికులు ఆందోళన చేపట్టారు. ఈ సందర్భంగా సులోచన మాట్లాడుతూ కాంగ్రెస్ పార్టీ మేనిఫెస్టోలో పేర్కొన్న విధంగా మధ్యాహ్న భోజన కార్మికులకు పది వేల గౌరవ వేతనం చెల్లించాలని కోరారు. గత విద్యాసంవత్సరం నుండి పెండింగులో సీఎం అల్పాహారం,మెస్ చార్జీలు విడుదల చేయాలని కోరారు. వంట కార్మికులకు తహసీల్దార్‌చే గుర్తింపు కార్డులు, ప్రమాదబీమాతో పాటు ఈఎస్ఐ, పీఎఫ్ సౌకర్యం కల్పించాలని కోరారు. కార్మికులకు యూనిఫాం, వంట పాత్రలు, వంట గ్యాస్, కోడిగుడ్లతో పాటు ఫైన్ క్వాలిటీ రైస్ ప్రభుత్వమే సరఫరా చేయాల్సిందిగా కోరారు. కార్యక్రమంలో వెంకటచారి, గంగవ్వ, కోరెక భాగ్య, సంగెం పద్మ,సరస్వతి,భూమయ్య, కార్మికులు పాల్గొన్నారు.

నేడు క్రీడా పోటీలు

మల్లాపూర్: మండల కేంద్రంలోని వ్యవసాయ మార్కెట్‌యార్డ్ ఆవరణలో మంగళవారం మండల స్థాయి క్రీడాపోటీలు నిర్వహించనున్నట్లు ఎంఈవో భీమయ్య ఒక ప్రకటనలో తెలిపారు. క్రీడా పాఠశాల(స్పోర్ట్స్ స్కూల్) నందు 4వ తరగతి ప్రవేశాల కోసం మండల స్థాయి క్రీడా పోటీలను నిర్వహిస్తున్నామన్నారు. వివరాలకు పీఈటీ విక్రమ్ (9493606514)ను సంప్రదించాలని సూచించారు.

ఇబ్రహీంపట్నం: మండలకేంద్రంలోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో మండలంలోని 4వ తరగతి విద్యార్థులకు స్పోర్ట్స్ స్కూల్‌లో ప్రవేశానికి ఈ నెల 25 ఉదయం 9 గంటలకు నిర్వహించనున్నట్లు ఇన్‌చార్జి ఎంఈవో ఆనందరావు సోమవారం తెలిపారు. వివరాలను ఎం. రాజు 9441183035, అశోక్ 9494992967 నంబర్లలో సంప్రదించాలని పేర్కొన్నారు.

నేడు లయన్స్‌క్లబ్ కంటి వైద్యశిబిరం

మల్లాపూర్: మండల కేంద్రంలోని శ్రీ వాసవీ కన్యక పరమేశ్వరి ఆలయ ఆవరణలో మంగళవారం లయన్స్‌క్లబ్ ఆధ్వర్యంలో కంటి వైద్యశిబిరం నిర్వహించనున్నట్లు లయన్స్‌క్లబ్ రిజియన్ చైర్మన్ శివ శ్రీనివాస్, రిజియన్ కార్యదర్శి రుద్ర రాంప్రసాద్, పాస్ట్ అధ్యక్షుడు కనుక సంజీవ్, ఎలక్ట్ అధ్యక్షుడు తోట రాజారాం తెలిపారు.

క్రీడా పాఠశాలలో ప్రవేశానికి 26న ఎంపిక పోటీలు

పెగడపల్లి: తెలంగాణ క్రీడా పాఠశాలల్లో 2024–25 సంవత్సరానికి గాను నాలుగో తరగతిలో ప్రవేశం పొందేందుకు పెగడపల్లి మండల పరిధిలోని బాల, బాలికలకు స్థానిక జడ్పీహెచ్ఎస్ పాఠశాలలో ఎంపిక పోటీలు నిర్వహించనున్నట్లు ఎంఈవో శ్రీనివాస్, పీడీ రమేశ్ సోమవారం తెలిపారు.

మల్యాల: హైదరాబాద్‌లోని క్రీడా పాఠశాలలో 4వ తరగతిలో ప్రవేశాల కోసం మండల స్థాయిలో ఎంపిక పోటీలు ఈ నెల 26న తాటిపల్లి బాలికల గురుకుల కళాశాలలో నిర్వహించనున్నట్లు ఎంఈవో ఐత శ్రీనివాస్ తెలిపారు.

రాయికల్: పట్టణంలోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో క్రీడా పాఠశాల నాల్గో తరగతి ఎంపిక కోసం ఈనెల 26న ఎంపిక పోటీలు నిర్వహిస్తున్నట్లు ఎంఈవో గంగాధర్ సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు. వివరాల కోసం పీడీ కృష్ణప్రసాద్ 94400 37393, గంగాధర్ 99493 47048 నంబర్లను సంప్రదించాలని కోరారు.

రేపు ఇసుక దంపుల వేలం పాటలు

ధర్మపురి: ధర్మపురి, రాయపట్నం గ్రామాల్లో ఇటీవల మైనింగ్, పోలీస్, రెవెన్యూ అధికారులు స్వాధీనం పర్చుకున్న అక్రమ ఇసుక దంపులకు వేలం పాటలు నిర్వహిస్తున్నామని తహసీల్దార్ కృష్ణ చైతన్య సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు.

రోడ్డు కబ్జా కాకుండా చర్యలు తీసుకోవాలి

ఇబ్రహీంపట్నం: మండలకేంద్ర శివారులోని సర్వే నంబర్ 486లో వ్యవసాయ భూమికి వెళ్లే దారి కబ్జా చేస్తున్నారని, వారిపై చర్యలు తీసుకోవాలని తిమ్మని అంజయ్య సోమవారం ప్రజావాణిలో ఫిర్యాదు చేశారు. ప్రజావాణిలో ఒకే దరఖాస్తు వచ్చినట్లు తహసీల్దార్ ప్రసాద్ తెలిపారు. సమావేశంలో అధికారులు పాల్గొన్నారు.

విద్యుత్ సరఫరాలో అంతరాయం

కోరుట్ల రూరల్: మండలంలోని పైడిమడుగు,మాదాపూర్ సబ్‌స్టేషన్ పరిధిలోని పైడిమడుగు, జోగిన్‌పెల్లి, కల్లూర్, సర్పరాజ్‌పల్లి, మాదాపూర్ గ్రామాల్లో మంగళవారం ఉదయం 9 గంటల నుంచి మధ్యాహ్నం 1 గంటల వరకు విద్యుత్ సరఫరా నిలిపివేస్తామని ఏఈ శ్రీనివాస్ నాయక్ తెలిపారు.

తొలగిన ముసుగు

ఇబ్రహీంపట్నం: అసెంబ్లీ పార్లమెంట్ ఎన్నికల కోడ్ ముగిసినా నాయకుల విగ్రహాలకు వేసిన ముసుగులు తొలగించలేదని సోమవారం సాక్షిలో ‘కోడ్ ముగిసినా తొలగని ముసుగు’ అనే శీర్షికన ఫొటో స్టోరీ ప్రచురితం కాగా, పంచాయతీ కార్యదర్శి శ్రీకాంత్ ఎన్టీఆర్ విగ్రహానికి వేసిన ముసుగును తొలగించారు.

రోడ్డు ప్రమాదంలో గాయపడ్డ వ్యక్తి మృతి



మెట్‌పల్లి: పట్టణంలోని వెంకట్రావ్‌పేట శివారులో జాతీయ రహదారిపై రోడ్డు ప్రమాదంలో గాయపడ్డ గుర్తు తెలియని వ్యక్తి మృతి చెందినట్లు ఎస్సై చిరంజీవి ఆదివారం తెలిపారు. సుమారు 60 ఏళ్ల వయసు గల వ్యక్తి శనివారం రాత్రి రోడ్డు మీద నడుచుకుంటూ వెళ్తుండగా, గుర్తు తెలియని వాహనం ఢీ కొట్టింది. ఈ సంఘటనలో తీవ్రంగా గాయపడ్డ అతన్ని 108 వాహనంలో స్థానిక ప్రభుత్వాసుపత్రికి తరలించగా, అక్కడ చికిత్స పొందుతూ ఆదివారం రాత్రి మరణించాడు. ఎవరైనా మృతదేహాన్ని గుర్తు పడితే సమాచారమివ్వాలని ఎస్సై పేర్కొన్నారు.

సీఐ విచారణ

రాయికల్: పట్టణానికి చెందిన బాలికపై సింగు గంగనర్సయ్య లైంగికదాడికి పాల్పడినట్లు కేసు నమోదైన విషయం తెల్సిందే. ఈ ఘటనపై సోమవారం జగిత్యాల రూరల్ సీఐ కృష్ణారెడ్డి ఠాణాలో విచారణ చేపట్టారు.

ఇసుక ట్రాక్టర్ల పట్టివేత

మెట్‌పల్లిరూరల్: మెట్‌పల్లి మండలం రామలచ్చక్కపేట వరదకాల్వ నుంచి ఇసుక తరలిస్తున్న నాలుగు ట్రాక్టర్లను సోమవారం పోలీసులు పట్టుకున్నారు. ట్రాక్టర్లను సీజ్ చేసి మెట్‌పల్లి డిపోకు తరలించారు.

సారంగాపూర్: బీర్‌పూర్ మండలం కొల్వాయి గ్రామ శివారుల్లో అక్రమంగా ఇసుక తరలిస్తున్న ట్రాక్టర్‌ను సోమవారం పోలీసులు పట్టుకుని కేసు నమోదు చేసినట్లు ఏఎస్సై గజేందర్ తెలిపారు. బీర్‌పూర్‌కు చెందిన అప్పాల ప్రభాకర్ తన ట్రాక్టర్‌లో ఇసుకను తరలిస్తుండగా ట్రాక్టర్ సీజ్ చేసి, కేసు నమోదు చేసినట్లు పోలీసులు తెలిపారు.

బెదిరించి.. సెల్‌ఫోన్ ఎత్తుకెళ్లి..

కోరుట్ల:కోరుట్ల మండలం పైడిమడుగు శివారులో సోమవారం వేకువజామున మూడు గంటలకు ముగ్గురు దుండగులు దారికాచి కోరుట్ల నుంచి రాయికల్ వెళ్తున్న ఓ లారీని ఆపి డ్రైవర్ మధుసూదన్‌ను బెదిరించి సెల్‌ఫోన్ ఎత్తుకెళ్లారు. దీంతో మధుసూదన్‌తోపాటు అదే తోవలో వెళ్తున్న కొంత మంది గ్రామస్తులు మోటార్‌సైకిల్‌పై దుండగులను వెంబడించారు. దీంతో దుండగులు మోటార్‌సైకిల్‌ను వదిలి పరారయ్యారు. మధుసూదన్ ఫిర్యాదు మేరకు కేసు దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై కిరణ్ తెలిపారు.